# ఉపాధి అక్రమాలకు చెక్

- అవినీతి కట్టడికి కేంద్రం చర్యలు
- ఈ- కేవైసీ చేయని కూలీలకు పని కల్పించే అవకాశం లేదు
- మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌లో వివరాల నమోదు
- కూలీల ఆధార్ జాబ్ కార్డుతో అనుసంధానం

**ఉపాధిహామీ కూలీల వివరాలు**

| మండలం | మొత్తం కూలీలు | పనిచేస్తున్నవారు |
|---|---|---|
| అనపర్తి | 12,844 | 9,044 |
| బిక్కవోలు | 19,003 | 14,162 |
| రంగంపేట | 18,579 | 13,555 |
| పెదపూడి | 23,035 | 13,099 |
| మొత్తం | 73,461 | 49,860 |



రంగాపురంలో ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలు (ఫైల్)



తొస్సిపూడిలో ఈ-కేవైసీపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో అగస్టీన్ కుమార్

బిక్కవోలు: ఉపాధి హామీ పథకం కూలీలు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూలీలు తమ ఆధార్ కార్డును జాబ్ కార్డుతో అనుసంధానం చేసుకుంటేనే ఉపాధి హామీ పని కల్పించాలని నిర్ణయించింది. ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ కోసం ఎంజీఎన్‌ఆర్‌ఈ జీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టింది. ఉపాధి కూలీలు ఆధార్, ఉపాధి వివరాలు నమోదు చేసి ముఖ గుర్తింపు కార్డు ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇందుకు కూలీలు తమ ఆధార్, జాబ్‌కార్డులతో స్వగ్రామంలోని ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదిస్తే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఆధార్ కార్డును కూలీలు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకుని ఉండాలి. ఈ -కేవైసీ ప్రక్రియ చేయించుకోని కూలీలకు ఇకపై పని కల్పించడం వీలుపడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**పనుల్లో పారదర్శకత కోసమే**

ఉపాధిహామీ పథకం పనుల్లో పారదర్శకత కొరవడిందన్నా ఆరోపణలు, నిధులు దుర్వినియోగం చేస్తున్నట్లు తరచూ సోషల్ ఆడిట్‌లో వెల్లడవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. క్షేత్రస్థాయిలో చోటు చేసుకునే అవినీతికి చెక్ పెట్టేందుకు సాంకేతికను వినియోగించాలని నిర్ణయించింది. కొత్తగా కేంద్రం తీసుకున్న ఈ -కేవైసీ విధానంతో పనుల్లో పారదర్శకత పెరుగుతుందని, ఒక జాబ్ కార్డుపై మరొకరు పనిచేసే అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

**ఈ-కేవైసీ చేయించుకోవాలి**



ఉపాధిహామీ పథకం కూలీలు తప్పనిసరిగా ఈ -కేవైసీ చేయించుకోవాలి.నమోదు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. జాబ్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్‌ఆర్ ఈజీఎస్ సిబ్బందికి ఆదేశాలిచ్చాం. కూలీలు ఆధార్ వివరాలను వీలైనంత త్వరగా అప్‌డైట్ చేసుకోవాలి. త్వరలో ఈ -కేవైసీ పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకకుంటున్నాం

– శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు

## పాముకాటు మందు లేకే వీరబాబు మృతి

- అన్ని పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలి
- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాజా



మృతుడి సోదరుడికి ధైర్యం చెబుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: పాముకాటు మందు అందుబాటులో లేకపోవడం వల్లే గాదరాడకు చెందిన పి.వీరబాబు మృత్యువాత పడ్డాడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో ఆ వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గాదరాడ గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో బాధితులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం దారుణమన్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని పీహెచ్‌సీలో స్నేక్ బైట్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచి పాము కాటు మరణాలు తగ్గించామన్నారు. వ్యవసాయ సీజన్ పనులు ముమ్మరం కావడంతో పొలం గట్లపై విష సర్పాలు సంచరిస్తాయన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు అందుబాటులో ఉండాలనే నిబంధనలను ఉల్లఘించారని, దానిలోని భాగంగానే సెప్టెంబరు 30న పాము కాటుకు గురైన వీరబాబుకు సక్రమమైన వైద్యం అందక మృతి చెందాడన్నారు. ఆందోళనలో మృతుడు సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు తోరాట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నత్తల నివారణకు చర్యలు చేపట్టాలి



మిర్తిపాడులో రైతులతో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారి రినీ

సీతానగరం: నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు ఉద్యానవన శాఖ అధికారి రినీ సూచించారు. ఆమె సోమవారం మిర్తిపాడు, ఉండేశ్వరపురాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నత్తలు ఆశించిన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇవి మామూలుగా తోటల్లో కనిపించేవి కావని, ఆఫ్రికా నుంచి వలస వచ్చిన జాతి అన్నారు. ఒక్కొక్క నత్త వెయ్యి నుంచి 12 వందల గుడ్లు పెడుతుందన్నారు. కిలో ఉప్పును ఐదు లీటర్ల నీటిలో కలిపిన ద్రావణంలో నత్తలను వేస్తే సమగ్రంగా నివారించవచ్చన్నారు. వాటి ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటిలో మూడు గ్రాముల చిలెటెడ్ కాపర్, మూడు గ్రాములు చిలెటెడ్ ఐరన్ కలిపి చెట్ల మీద పిచికారీ చేస్తే రాలిపోయి, చనిపోతాయన్నారు. ఒక తోట నుంచి మరో తోటకు వ్యాప్తి చెందకుండా సరిహద్దుల్లో అక్కడక్కడ ఉప్పు నీరు చల్లిన గోనే పట్టాలను పరచాలని సూచించారు. ఎరీస్ కంపెనీ సిబ్బందితో కలిసి రైతుల తోటల్లో కెమికల్‌ను ప్రయోగాత్మకంగా చేయించారు.

## పీస్ ఐకాన్ అవార్డు గ్రహీత జాకబ్ రాజుకు సత్కారం



గుమ్ములూరు హైస్కూల్లో జాకబ్ రాజును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోరుకొండ: పీస్ ఐకాన్ అంతర్జాతీయ అవార్డు గ్రహీత కె.జాకబ్ రాజును సోమవారం గుమ్ములూరు హైస్కూల్లో సత్కరించారు. ఆ పాఠశాలలోని సహోపాధ్యాయులంతా శాలువా, పూలమాలలతో అభినందించారు. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ పీస్ సమ్మిట్ కార్యక్రమంలో కొరియా దేశానికి చెందిన మాత్యూహంగ్ చేతుల మీదుగా జాకబ్ రాజు అవార్డు తీసుకున్నారు. దానిని పురస్కరించుకుని గుమ్ము లూరు హైస్కూల్లో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా రాంబాబు, మాజీ సర్పంచ్ చిటికిన భాస్కరరావు, స్థానిక నాయకుడు కంచు మర్తి దుర్గాప్రసాద్, హెచ్‌ఎం గంగాభవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రఘుదేవపురం జెడ్పీ హైస్కూల్‌కు అవార్డు



జిల్లా స్థాయి అవార్డు సాధించిన రఘుదేవపురం హైస్కూల్

సీతానగరం: రఘుదేవపురం పీఎమ్‌శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్‌ఏఎస్‌ఏలో జిల్లా స్థాయి విభాగంలో స్వచ్ఛ పాఠశాల అవార్డు పొందిందని ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్యామలాదేవి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఐదు పాఠశాలలు ఎంపికయ్యాయని, వాటిలో తమ స్కూలు ఉండడం హర్షణీయమన్నారు. తమ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి వసతులు ఉన్నాయని, ఆహ్లాదకర వాతావరణంలో తరగతులు నిర్వహిస్తున్నామని, బాల బాలికలకు విడివిడిగా ప్రత్యేక మరుగుదొడ్లు ఉన్నాయన్నారు. ఈ అవార్డు రావడం వెనుక గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి ఉందని, అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవడం జరిగిందన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు



కోరుకొండలో నినాదాలు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

కోరుకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరిట ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం సరికాదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోకల వరదరాజ సాంచి అన్నారు. ఆయన కోరుకొండలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి కె.కృష్ణ మోహన్, జిల్లా కన్వీనర్ యార్లగడ్డ శ్రీనివాస్, కార్యదర్శి ఎస్.సుబ్రహ్మణ్యం, నియోజకవర్గం ఇన్‌చార్జి ఎస్.బాలాజీ పాల్గొన్నారు.

## నిషేధమా.. నీవెక్కడ!



డంపింగ్‌యార్డులో తగలబడుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

కడియం: ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, జీవులకు కలిగే ప్రమాదాలపై నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు సైతం ప్లాస్టిక్ ముప్పును గుర్తించినప్పటికీ క్షేత్రస్థాయిలో నియంత్రణ/నిషేధానికి మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదు. రీయూజబుల్ ప్లాస్టిక్ వినియోగంపై చట్ట ప్రకారం అనేక నిషేధాలు ఉన్నాయి. కానీ వీటి వినియోగాన్ని మాత్రం అవేవీ ఆపలేకపోతున్నాయి. ప్రతి గ్రామ శివార్లలోని డంపింగ్ యార్డులకు టన్నుల కొద్దీ చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలే దీనికి నిదర్శనం.

**అప్పట్లో హడావుడి**

వినియోగిస్తే ఒక ముప్పు, చెత్తలో పడేస్తే మరో ముప్పు, తగల బెడితే మరింత ముప్పు అంటూ ఎప్పటికప్పుడే ప్లాస్టిక్ ద్వారా వచ్చే ప్రమాదాలపై ప్రచారాలు మాత్రం ఏకధాటిగా సాగుతున్నాయి. అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ సీఎంల మధ్య ప్లాస్టిక్ నిషేధం అంశం కూడా ఇటీవలే పాపులర్ అయ్యింది. కానీ నిషేధం మాత్రం అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటి, రెండు వారాల పాటు ప్లాస్టిక్ నిషేధం అంటూ చిన్నా చితకా బడ్డీ కొట్లు మొదలుకుని, వ్యాపార సముదాయాల వరకు యంత్రాంగం హడావుడి చేసింది. నోటీసులు కూడా జారీ చేసేసి, ఇక ప్లాస్టిక్ నిషేధించేసినట్టే అన్న రీతిలో వ్యవహరించింది. ఉన్నతాధికారులను ఆదర్శంగా తీసుకున్న గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు అంటూ హంగామా చేసి, ఆ తర్వాత మిన్నకుండిపోయారు.

**టన్నులకొద్దీ వ్యర్థాలు**

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్‌ను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో యథాతథంగా టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. అక్కడ మంటల్లో కాలి వాతావరణ కాలుష్యానికి, తద్వారా ప్రజారోగ్యానికి గొడ్డలిపెట్టుగా మారుతున్నాయి. ఈ తతంగమంతా యంత్రాంగం కళ్లెదుటే జరుగుతున్నప్పటికీ ఏమాత్రం చలనం ఉండడం లేదు. అధికారులు వచ్చి అడిగే చూద్దాములే అన్న రీతిలో వ్యాపార/వాణిజ్య సముదాయాలు కూడా తిరిగి ప్లాస్టిక్ వినియోగం బాట పట్టేశాయి. ఎక్కడికక్కడ పాలిథిన్ బ్యాగుల వినియోగం సాధారణ స్థితిలోనే కొనసాగుతోంది.

## రావమ్మా.. గౌరమ్మా

- గ్రామంలో ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు
- రెండేళ్లకోసారి నిర్వహించే జాతరకు సిద్ధమైన ఊలపల్లి



ఊలపల్లిలో పెదగౌరమ్మ తల్లిని ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు



చిన్నగౌరమ్మ తల్లి ఊరేగింపు



గంగిరెద్దుల వారి వేషధారణలో యువకులు



దొంగ పోలీసు, సీతారాములు, శివపార్వతి, వేషధారణలో చిన్నారులు

బిక్కవోలు: రావమ్మా... గౌరమ్మా అంటూ గ్రామస్తులు భక్తుల అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో రెండేళ్లకోసారి నిర్వహించే గౌరీదేవి జాతరకు సంబంధించి సోమవారం గ్రామంలో వరి దుబ్బులతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. నెల రోజుల పూజల అనంతరం పెద్ద గౌరమ్మ, చిన్న గౌరమ్మ ఆలయాల వద్ద భారీ జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని గ్రామ పొలిమేర నుంచి బ్యాండ్ మేళాలు, తీన్‌మార్ డప్పులు, కేరళ డప్పులు, శక్తి వేషాలు, గొర్ర గేదెలు, ఎలుగుబంటి వేషధారణ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

**విచిత్ర వేషధారణలో యువకుల సందడి**

గ్రామస్తులు శివపార్వతి, సీతారాములు, సావిత్రి-యముడు ఇలా వివిధ రకాలు వేషధారణతో చిన్న, పెద్ద అని తేడాలేకుండా గ్రామస్తులు సందడి చేశారు. అమ్మవారికి పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి అనంతం ఆలయంలో ప్రతిష్ఠించారు. నేటి నుంచి తీర్థం వరకు ప్రతి రోజు అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహిస్తారు. జాతర రోజున రెండు ఆలయాల నిర్వాహకులు ఉత్సాహంగా సంబరాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ సంబరానికి స్థానికులతోపాటు గ్రామస్తులు, బంధువులు ఏ ప్రాంతాల్లో ఉన్నప్పటికీ ఇక్కడికి రావడం అనవాయితీగా ఉంటోంది. పెద గౌరమ్మ ఆలయం వద్ద గౌరమ్మ తల్లిదండ్రులుగా రాజమహేంద్రవరానికి చెందిన సోమిరెడ్డి ఉమారాజేష్, ఉమామహేశ్వరి దంపతులు వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులుగా పోతల వీరవెంకటసత్యనారాయణ, యాళ్ల మురళీ సింహాచలం, రొంగల వీర్రాజు వ్యవహరిస్తున్నారు. చిన్న గౌరమ్మ ఆలయం వద్ద గ్రామానికి చెందిన కరక శంకర్, సుభద్ర దంపతులు అమ్మవారికి తల్లిదండ్రులుగా వ్యహరిస్తారు.

## క్లుప్తంగా

### సోమేశ్వరస్వామి ఆలయంలో లక్షపత్రి పూజ

పెదపూడి: ప్రాచీన ప్రసిద్ధి చెందిన పెదపూడిలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్షపత్రి పూజను అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు యాగాది రుద్రాభిషేకం, సహస్ర కుంకుమార్చన, చండీయాగం తదితర పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజల్లో కూర్చున్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



కుతుకులూరులో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన గ్రామస్తులు, ఉపాధ్యాయులు

అనపర్తి: కుతుకులూరు ఉన్నత పాఠశాల వద్ద రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నక్కిన వీరరాఘవరావు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందికట్ల లూథర్ పాల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.విజయభారతి మాట్లాడుతూ ఇద్దరు ఉపాధ్యాయులు అవార్డు సాధించడం చాలా గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలోని తమలంపూడి సూరారెడ్డి, నల్లమిల్లి తాతారెడ్డి, దేవస్థానం చైర్మన్ కొవ్వూరి రామారెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పులగం సంతోషలక్ష్మి పాల్గొన్నారు.

### 284 మందికి వైద్య సేవలు



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం రామకృష్ణ మఠం వారి వైద్య శిబిరంలో 224 మందికి, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి శిబిరంలో 60 మంది వైద్య సేవలు అందించారు. డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ ఎండీ ఫాతిమా సేవలు అందించారు. ఈ శిబిరాల్లో రక్త పరీక్షలు, కంటి పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరుగురికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని ఆపరేషన్ కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, వై.వెంకట నారాయణ, చంటిబాబు, కె.శ్రీనివాసరావు, పాండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బాణసంచా లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

బిక్కవోలు: మండలంలోని తాత్కాలిక బాణసంచా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బీఎస్ వీవీ కృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనులు ప్రకారం బాణసంచా విక్రయించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.ఫైర్ అనుమతి, ఆన్‌లైన్ చలానా పాటు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ నెల 13వ తేదీలోగా రాజమహేంద్రవరం డివిజన్ కార్యాలయం అందించాలన్నారు.

### గైట్ అధ్యాపకుడికి సత్కారం



గురుబ్రహ్మ అవార్డు అందుకుంటున్న అధ్యాపకుడు గోపి

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ క్యాంపస్‌లోని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సి.గోపిని 'గురుబ్రహ్మ' అవార్డుతో సత్కరించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గోదావరి టాలెంట్ టెస్ట్, రాజమండ్రి రౌండప్‌లు సంయుక్తగా రాజమహేంద్రవరంలోని ఆనంద్ రీజెన్సీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ సత్కారం జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

### జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ జీఎస్టీ అంటే ఏమిటి, దాని తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, అధ్యాపకులు నాగేశ్వరరావు, ఎస్‌డీ మదీనా పాల్గొన్నారు. అలాగే ఉండేశ్వరపురంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ వల్ల కలిగే లాభాలను వివరించారు.

### ఉపాధి పనులకు ఈ-కేవైసీ తప్పనిసరి



ఎంపీఈఓ రూనీ్స

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఏస్)లో కూలీలందరూ తమ జాబ్ కార్డుతో ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 15,730 మందికి ఉపాధి జాబ్ కార్డులు ఉన్నాయని, వారిలో ఇంతవరకూ 3600 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా సత్వరమే ఆ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఎన్‌ఆర్‌జీఎస్‌కి చెందిన యాప్‌లో ఫేస్ అటెండెన్స్ ఇస్తున్న ఉపాధి కూలీలే ఇందుకు అర్హులన్నారు.

### పీజీఆర్‌ఎస్‌కు ఒక్క అర్జీ

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి ఒక అర్జీ అందింది. కాటవరంలోని స్థలాన్ని తనకు తెలియకుండా బంధువులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ చినకొండేపూడి-2కు చెందిన రాజేష్ ఫిర్యాదు చేశాడు. ఇన్‌చార్జి ఎంపీడీవో కేవీఎస్‌ఎస్ మూర్తి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్, టైపిస్ట్ సతీష్ పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామానికి చెందిన మద్దాల వెంకట అప్పారావుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందింది. ఉదయం మేతకు వెళ్లిన ఈ గేదె సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో తిరిగి వస్తుండగా, రాపాక – కోటికేశవరం రోడ్డులో రాపాక శివారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు తెగి దానిపై పడింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పశు వైద్యులు ఘటనా స్థలంలో గేదెకు పోస్టుమార్టం నిర్వహించారు. దాని విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పాడి రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

### పేకాట శిబిరంపై దాడి



పేకాట ఆడుతూ పట్టుబడిన నిందితులు

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో మార్గాని వెంకటేశ్వరరావుకు చెందిన ఫామ్ హౌస్‌లో పేకాట ఆడుతున్న 12 మందిని సోమవారం అరెస్టు చేశామని ఎస్సై పి.నారాయణమ్మ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. నిందితుల నుంచి రూ.19,840, తొమ్మిది మోటారు సైకిళ్లు, తొమ్మిది సెల్ ఫోన్లు, ఒక ప్లాస్టిక్ టేబుల్, 10 కుర్చీలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

### అదుపు తప్పి.. డివైడర్ పైకెక్కి..



బొమ్మూరు వద్ద జాతీయ రహదారి డివైడర్ పైకి ఎక్కేసిన వాహనం

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారి బొమ్మూరు వద్ద డివైడర్ పైకి సోమవారం మధ్యాహ్నం ఓ జీపు దూసుకుపోయింది. వేమగిరి వైపు నుంచి బొమ్మూరు వైపు వస్తున్న ఆ వాహనం సుద్దగని వద్దకు వచ్చేసరికి అతి వేగం కారణంగా అదుపు తప్పింది. డివైడర్‌పై బలమైన ఇనుప తీగలు కట్టి ఉండడంతో అక్కడికక్కడే నిలిచిపోయింది. లేకపోతే ఇవతల రోడ్డులోకి వచ్చిఉంటే ప్రమాదం భారీగా జరిగేది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో ఈ ఘటన జరిగిందని భావిస్తున్నాడు. జీపు అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కంబాలచెరువు: టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టి.విజయ్‌కృష్ణ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆవ వాంబేకాలనీకి చెందిన విజయ్ కృష్ణ ద్విచక్ర వాహనంపై రైల్వే స్టేషన్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వైపు వస్తున్నాడు. అయితే పక్క రోడ్డులోకి తిరిగే ప్రయత్నంలో ఆర్టీసీ బస్సు చక్రాల కిందకు వెళ్లిపోయాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 పైలట్ గణేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆ యువకుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్సకోసం కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆర్ట్స్ కళాశాలలో దీక్షారంభం కార్యక్రమం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు దీక్షారంభం కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. దీనికి జోన్ 1, 2 ఆర్జేడీ డాక్టర్ పీవీ కృష్ణాజీ ముఖ్యఅతిథిగా విచ్చేసి, విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలు, గొప్ప విద్యావేత్తలు ఆర్ట్స్ కళాశాలలో విద్యను అభ్యసించారన్నారు. కళాశాలలోని స్టార్టప్‌లు, ల్యాబ్‌లు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ క్రాస్ సర్వీసులు, జేకేసీ ఉద్యోగ అవకాశాలను వివరించారు.